ఐడీఎల్ చెరువుపై అపరిశుభ్రంగా వాకింగ్ ట్రాక్



కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువుపై ఉన్న వాకింగ్ ట్రాక్‌పై పేరుకుపోయిన చెత్తా చెదారం

మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువుపై ఉన్న వాకింగ్ ట్రాక్‌పై చెత్తా చెదారం పేరుకుపోతోంది. మొక్కల కొమ్మలు కూడా ట్రాక్‌ను ఆక్రమించటంతో వాకింగ్ చేసేవారికి ఇబ్బందిగా ఉంది. దుమ్ము, ధూళి అలాగే ఉండటంతో వాకర్స్ ఇబ్బంది పడుతున్నారు. ఆరోగ్యం కోసం ఉదయం వాకింగ్‌కు వెళితే దుమ్ము, ధూళి లేచి అనారోగ్యం పాలవుతున్నాం అని వాకర్స్ వాపోతున్నారు. కనీసం ట్రాక్‌పైన కూడా శుభ్రం చేయటం లేదని, రోడ్డుపై శుభ్రం చేసిన చెత్తను కూడా ట్రాక్ పక్కనే పడవేస్తున్నారని తెలిపారు.పలు మార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వాకింగ్ ట్రాక్‌ను శుభ్రం చేయాలని కోరుతున్నారు.

హిందూ ఏక్తా యాత్రను విజయవంతం చేద్దాం



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్నమాధవరం కాంతారావు తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి స్వచ్ఛ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో జూన్ 1న చేపట్టనున్న శ్రీ వీర హనుమాన్ ఏక్తా యాత్రనే విజయవంతం చేయాలని వ్యవస్థాపక అధ్యక్షులు మాధవరం కాంతరావు ఓ ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా బాలాజీనగర్‌లోని శ్రీ సంజీవినీ హనుమాన్ దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ర్యాలీకి సంబంధించి ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లి స్వచ్ఛ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హిందూ ఏక్తా ర్యాలీలో ప్రతి ఒక్కరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటి సభ్యులు, సంజీవని హనుమాన్ దేవాలయ సభ్యులు, హిందూ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అంతా అస్తవ్యస్తం

- పాపిరెడ్డి నగర్‌లో అంతర్గత రోడ్లు తవ్వి వదిలేశారు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు





పాపిరెడ్డినగర్‌లో డ్రైనేజి నిర్మాణం చేపట్టి సీసీ రోడ్డు వేయని అంతర్గత రహదారులు

ఆల్విన్‌కాలనీ: అభివృద్ధి పేరిట ఆధునీకరమైన డ్రైనేజీ నిర్మాణం పేరుతో అంతర్గత రోడ్లను తవ్వి వదిలేసి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవటంతో స్థానికులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్‌లో అండర్ గ్రౌండ్ నిర్మాణ పనుల కోసం అంతర్గత రోడ్లు తవ్వి వదిలేశారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మంచినీటి పైపులైన్లను పరిమాణం పెంచి నిర్మాణం చేపట్టారు. నిర్మాణం పూర్తయిన తరువాత అధికారులు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టకుండా నెలల తరబడి వదిలివేస్తున్నారు. దీంతో వృద్ధులు, చిన్నారులు, మహిళలు బయటకు రావాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు ఈ అంతర్గత రోడ్లలో ప్రయాణించలేక కనీసం పార్కింగ్ సదుపాయం లేక దూర ప్రాంతంలో పార్కింగ్ చేసుకోవాల్సిన పరిస్థితి కలిగింది. అంతేకాకుండా రోడ్డు మధ్యలో పైపులైన్‌ల నిర్మాణం జరగటంతో మట్టి కుప్పలు రోడ్డు మధ్యలోనే ఉంచటంతో నడవటానికి కూడా ఇబ్బందులు కలుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఎన్నికల కోడ్ పేరుతో నిర్మాణం చేపట్టకుండా ఆపివేశారు. సంబంధిత అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని పలుమార్లు విన్నవించినా ఇటు వైపు చూసిన దాఖలాలు కూడా లేవు. నిర్మాణ పనులను వెంటనే చేస్తే ఎవరికి ఎటువంటి ఇబ్బంది ఉండదని, నెలల తరబడి అసంపూర్తిగా సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఈ విధంగా వదిలి వేయటంతో సమస్యగా ఉందని, అదే వర్షం పడితే ఈ ప్రాంతమంతా చిత్తడిగా, బురదమయంగా తయారై బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.బయటకు వెళ్లిన వారు ఈ ఇంటికి రాలేని పరిస్థితి నెలకొందని పలువురు పేర్కొంటున్నారు. అంతేకాకుండా కంకర రాళ్లు మొనతేలి ఉండటంతో చిన్నారులను ఆడుకోవటానికి బయటకు పంపాలన్నా పంపలేని పరిస్థితి నెలకొంది. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ ప్రాంతాన్ని పరిశీలించి పాపిరెడ్డి నగర్‌లోని సీసీ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యకల్పనకు పలువురి అభినందనలు



విద్య కల్పన ఏకాంత్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న వివేకానందనగర్ నాయకులు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ సహకారంతో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన విద్యకల్పన ఏకాంత్‌గౌడ్‌ను ఆమె నివాసంలో కలిసి పలువురు నాయకురాళ్లు శనివారం శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో వివేకానందనగర్ డివిజన్ నాయకులు జితేందర్, వినోద్, మహిళా నాయకురాళ్లు సంధ్య, షాలిని, వనజ, కళ్యాణి తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలోని 'నాన్ సీఓఈ (సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్)' గురుకుల విద్యాలయాల్లో జూనియర్ ఇంటర్మీడియట్‌లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపల్ ఏ శారద శనివారం తెలిపారు. పదవ తరగతి పాసైన విద్యార్థులు ఈనెల 31వ తేదీ వరకు గురుకుల సొసైటీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ, వృత్తివిద్యా కోర్సుల్లో సీట్లు ఉన్నాయని తెలిపారు. దరఖాస్తు రుసుము ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాలాల పరిశీలన

హఫీజ్‌పేట్ : కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్ నాలాలను శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్, ఇంజనీరింగ్ అధికారులతో శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలాల పూడికతీత, అభివృద్ధి పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

సిగరెట్ ఇవ్వలేదని వ్యక్తిపై దాడి



నిందితుడు ముఖేష్



బాధితుడు మహమ్మద్ ముజమ్మిల్

మోతీనగర్: సిగరెట్ ఇవ్వనందుకు ఓ వ్యక్తిని పలువురు కొట్టిన సంఘటన అల్లాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను అల్లాపూర్ సీఐ సామల వెంకటరెడ్డి విలేకరుల సమావేశంలో తెలిపారు. శనివారం ఉదయం 4 గంటలకు న్యూ అల్లాపూర్‌లో నివాసముండే మహమ్మద్ ముజమ్మిల్ అతని స్నేహితులైన షేక్ ఇమ్రాన్, ప్రసాద్ నాయుడు, మహ్మద్ అహ్మద్‌లతో కలిసి అల్లాపూర్‌లోని జనప్రియ నగర్‌లోని బిర్యాని సెంటర్‌కు వెళ్లాడు. అలాగే ముఖేష్ తన స్నేహితులైన నరేష్, రాకేష్‌తో పాటు మరో అయిదుమంది బిర్యాని సెంటర్‌కు వచ్చారు. ముకేష్ మహ్మద్ ముజమ్మిల్‌ను ముఖేష్ అగ్గిపెట్టె అడగ్గా ఇచ్చాడు. తరువాత సిగరెట్ అడిగాడు. దీంతో మహమ్మద్ ముజమ్మిల్ లేదని తెలిపారు. దీంతో ముఖేష్ అతని స్నేహితులు అక్కడ ఉన్న కర్రతో మహమ్మద్ ముజమ్మిల్‌ను తలపై, ముక్కుపై, శరీరంలోని ఇతర ప్రాంతాల్లో కొట్టారు. దీంతో తలపగిలి రక్త స్రావం జరిగింది. దీంతో ముఖేష్ స్నేహితులు కూడా బాధితుడిని కొట్టారు. అనంతరం అతని స్నేహితులు ఆసుప్రతికి తరలించారు. దీంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. మహమ్మద్ ముజమ్మిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలు వినియోగించుకోవాలి

మూసాపేట: ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కాంగ్రెస్ పార్టీ మూసాపేట డివిజన్ మాజీ అధ్యక్షుడు చున్నూ పాషా పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు మూసాపేట గూడ్స్ షెడ్ రోడ్డులోని రాయల్ ఫంక్షన్ హాలు వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిరంలో షుగర్, థైరాయిడ్, జనరల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరిసర ప్రాంతాల వాసులు ఈ వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ పరిధిలోని తారకరామ్ నగర్ కాలనీకి చెందిన కమలమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆదేశాల మేరకు శనివారం స్థానిక నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి డివిజి ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సిహెచ్. భాస్కర్, సంతోష్ ముదిరాజ్, అంబదాసు, బాలు తదితరులు ఉన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



గ్రీన్‌ల్యాండ్స్ డివిజన్ ఇంజనీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎస్ఎం పాషా

మోతీనగర్: తెలంగాణ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న రెగ్యులర్, ఆర్టిసన్, ఆన్‌మెన్, పీస్‌రేట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాని కోరుతూ శనివారం తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్ఎస్ఎం పాషా గ్రీన్‌ల్యాండ్స్ డివిజన్ ఇంజనీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికుల ముఖ్యమైన సమస్యలను ఫిబ్రవరి 26న యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లామని, ఇంతవరకు అవి పరిష్కారం కాలేదన్నారు. యాజమాన్యం ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలని కోరామన్నారు. ఆర్టిజన్ కార్మికులందరినీ విద్యార్హతను బట్టి జెఎల్ఎం, జేపీఏ, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్, సబ్ ఇంజనీర్ తదితర రెగ్యులర్ పోస్టులకు కన్వర్షన్ ఇవ్వాలని, ఆన్‌మ్యాన్ వ్యవస్థను రద్దు చేసి ఆ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులరైజ్ చేయాలని, వారికి ఆర్టిజన్‌లతో సమానంగా వేతనం అందజేయాలని కోరారు. ఒకే సంస్థ ఒకే సర్వీస్ రూల్స్ అమలు చేయాని, పీస్ రేట్‌కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రంలో కోరామన్నారు. ఏపీఎస్ఈబీ కాలం నుంచి మన సంస్థను నమ్ముకొని పనిచేస్తున్నట్లువింటి ప్రైవేట్ మీటర్ రీడర్లు, బిల్ కలెక్టర్లు, టిఆర్‌వై కార్మికులు, ఈఆర్‌ఓలో పిపిఏ కార్మికులు, సెక్యూరిటి గార్డులు, వాచ్ అండ్ వార్డు కార్మికుల సేవలను గుర్తించి మన సంస్థలో విలీనం చేసుకొని ఆర్టిసన్స్‌గా గుర్తించాలని, కనీస వేతనం జీవో అమలు చేసి కనీస వేతనాలు, ఈఎస్ఐ, పిఎఫ్ , మెడికల్ క్రెడిట్ కార్డు సౌకర్యం వంటివి కల్పించాలని కోరామని డివిజన్ అధ్యక్షుడు ఎస్ఎస్ఎం పాషా పేర్కొన్నారు.

సీఆర్ ఫౌండేషన్‌లో వరల్డ్ ఫ్యామిలీ డాక్టర్స్ డే



హఫీజ్‌పేట్: వరల్డ్ ఫ్యామిలీ డాక్టర్స్ డే సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఏపీఎఫ్‌టీ చాప్టర్ ఆధ్వర్యంలో శనివారం కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లోని వృద్ధాశ్రమంలో న్యూట్రిషియన్ ఫర్ ద ఎల్డర్లీ అనే అంశంపై వృద్ధులకు ఎలాంటి పోషక ఆహారం అవసరంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూకె ఎఫ్ఆర్‌సీజీపీ డాక్టర్ కిరణ్మయి, తెలంగాణ రాష్ట్ర ఏఎఫ్‌పీఐ ప్రెసిడెంట్ ఫ్యామిలీ డాక్టర్స్ ఆవశ్యకత ఎంత ముఖ్యమో వారు వివరించారు. అనంతరం న్యూట్రిషన్ అండ్ డయాబెటిస్ హెచ్ఓడీ ప్రొఫెసర్ వసుంధర మాట్లాడుతూ ముఖ్యంగా షుగర్, రక్తపోటు ఉన్నవారు ఎలాంటి ఆహారం తీసుకోవాలో వివరించారు.కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవరావు, హెల్త్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ రజిని, వృద్ధులు పాల్గొన్నారు.

ఈద్గా వద్ద వసతులు కల్పించాలని వినతి



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

హఫీజ్‌పేట్ : బక్రీద్ సమీపిస్తున్న క్రమంలో మాదాపూర్ డివిజన్ ఆదిత్యనగర్‌లోని జామా మసీద్ ఈ నూర్ కబర్థాన్, ఈద్గాల వద్ద సౌకర్యాలు కల్పించాలని శనివారం ఎమ్మెల్యే గాంధీని కమిటీ సభ్యులు కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రార్థనలు చేసుకోవడానికి వీలుగా అన్ని రకాల వసతులు కల్పిస్తామన్నారు.కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, సయ్యద్ అహ్మద్, ఖాసీం, సలీం, షోయబ్, లుక్మన్, రషీద్, అంజాద్, పూర్ణ పాల్గొన్నారు.

సదుపాయాల కల్పనకు కృషి

సుభాష్‌నగర్: మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామని గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. శనివారం డివిజన్ పరిధి మహదేవపురం నుండి రావినారాయణరెడ్డినగర్ ప్రధాన రహదారిలోని సెయింట్ ఆల్ఫోన్సస్ హైస్కూల్ సమీపంలో పెండింగ్ నాలా పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలా పనులు పూర్తయితే స్థానికంగా డ్రైనేజీ సమస్యతో పాటు వరదనీరు చేరకుండా ఉంటుందని, త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఆయన వెంట నాయకులు జగదీశ్వర్‌రెడ్డి, ప్రసాద్, మహేశ్వర్‌రెడ్డి, మల్లారెడ్డి, ఎస్.వి.రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కుట్టుమిషన్ అందజేత

హఫీజ్‌పేట్ : చందానగర్ హుడా కాలనీలో లయన్స్ క్లబ్ హోప్ ఆధ్వర్యంలో శనివారం హుడా కాలనీకి చెందిన మహేశ్వరి కుటుంబానికి కుట్టుమిషన్ అందించారు. లయన్ సభ్యులు మహిపాల్ రెడ్డి, శాంతిభూషణ్‌రెడ్డి మధుసూదన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

పంచవటి కాలనీలో చైన్‌స్నాచింగ్

గచ్చిబౌలి: వాకింగ్ చేస్తున్న ఓ యువతి మెడలోని గోల్డ్ చైన్‌ను గుర్తు తెలియని యువకుడు లాక్కెళ్లిన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ జీహెచ్ వెంకన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మణికొండలోని పంచవటి కాలనీ రోడ్ నెంబర్ 39లో వాకింగ్ ట్రాక్‌లో శుక్రవారం రాత్రి 8.14 గంటల సమయంలో వై.తేజస్విని(29) వాకింగ్ చేస్తోంది. వాకింగ్ ట్రాక్‌లోకి వచ్చిన గుర్తు తెలియని యువకుడు(22) తేజస్వినీ మెడలోని రెండు తులాల బంగారు గొలుసు లాక్కొని ఉడాయించాడు. బాధితురాలి ఫిర్యాదుతో రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వాకింగ్ ట్రాక్‌తో పాటు పరిసర ప్రాంతాలలోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

పార్కుల నిర్వహణేదీ..?

చెత్తాచెదారంతో నిండిపోయిన ఎఫ్‌సీఐ పార్కు, గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ పార్కు ● తుప్పపట్టిన పిల్లల ఆటవస్తువులు





మియాపూర్/ హఫీజ్‌పేట్: మియాపూర్, హఫీజ్‌పేట్ డివిజన్ల పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీ, వీడియో కాలనీ, గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీల్లో పార్కులు నిరుపయోగంగా మారాయి. కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరంలో ఆహ్లాదం అందని ద్రాక్షగా మారింది. పలు ప్రాంతాల్లో పార్కులను అభివృద్ధి చేసిన జీహెచ్ఎంసీ ప్రస్తుతం ఈ పార్కుల విషయంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. పార్కులను అభివృద్ధి చేయాలని అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నా పట్టించుకోవడం లేదంటున్నారు స్థానికులు. పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కులు చెత్త, చెదారంతో నిండిపోయాయి.

- మియాపూర్ డివిజన్‌పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీ, వీడియో కాలనీల్లోని పార్కులు పచ్చదనం కరువై చెత్త, చెదారంతో దర్శనమిస్తున్నాయి. కొన్నేళ్లుగా పార్కులను పట్టించుకనే వారే లేరని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎఫ్‌సీఐ కాలనీ పార్కులో చెత్త, చెదారాన్ని తొలగించి పార్కులోనే ఓ పక్క వేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- సర్వే నంబర్ 73,74లలో 23 ఎకరాల విస్తీర్ణంలో పేద, మధ్య తరగతి కుటుంబాలు ఇళ్ల నిర్మించుకున్నాయి. మౌలిక వసతుల కోసం రోడ్ల నిర్మాణంతో పాటు పార్కులకు ఖాళీ స్థలాలు కేటాయించారు. అప్పటి ఎమ్మెల్యేలు పి. జనార్దన్‌రెడ్డి, ఎం. భిక్షపతియాదవ్‌లు పార్కును అభివృద్ధి చేసి పార్కులో చిన్నారులకు కావాల్సిన ఆట వస్తువులు, కమ్యూనిటీ హాల్స్, బెంచీలు, లైట్స్ ఏర్పాట్లు చేశారు.
- ప్రస్తుతం పిల్లల ఆట వస్తువులు తుప్పుపట్టిపోవడంతో ఎప్పుడు విరిగి పోతాయోనని పిల్లలు, తల్లిదండ్రులు భయపడుతున్నారు. పిల్లలు ఆటలు ఆడడానికి వెనుకంజ వేస్తున్నారు.
- ఎఫ్‌సీఐ కాలనీ పార్కులో బోరు, కరెంట్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ బాక్స్‌లు మూతలు తెరుచుకొని ప్రమాదకరంగా ఉన్నాయి. పిల్లలు ఎప్పుడు ప్రమాదాల బారిన పడతారోనని పిల్లల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు.
- పార్కులను పట్టించుకోకపోవడంతో క్రిమికీటకాలు సంచరిస్తున్నాయ, రాత్రి వేళల్లో ఆకతాయిలు, మందు బాబులు పార్కుల్లోనే మద్యం సేవిస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చిన్నపాటి వర్షానికే చిత్తడిగా గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ పార్కు.. కూలిన ప్రహరీ

హఫీజ్‌పేట్ పరిధిలోని గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీలోని పార్కు ఇటీవల కురిసిన వర్షానికి అస్తవ్యస్తంగా తయారైంది. వరద, మురుగునీటితో నిండింది. ఇటీవల కురిసిన వర్షాలకు పార్కులో వరద నీరు భారీగా చేరడంతో వాకింగ్ ట్రాక్ మునిగింది. ప్రహరీ గోడ కూలింది. గత ఏడాది జీహెచ్ఎంసీ అధికారులు లక్షలాది రూపాయలతో పార్కులో అభివృద్ధి పనులు ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు కేవలం వాకింగ్‌ట్రాక్‌తో పాటు పార్కును చదును చేశారు. కాలనీలో రెండు పార్కులుండగా ఒక పార్కును కాలనీవాసులు సొంత నిధులతో అభివృద్ధి చేసుకున్నారు. ఇక యూనిసెంట్ స్కూల్ పక్కనే ఉన్న పార్కు నిరుపయోగంగా ఉంది. కాగా వర్షాలకు ఈ పార్కులో వరదనీటితో పాటు మురుగు కూడా చేరింది. కొండాపూర్‌లోని మై హోం మంగళ నుంచి ప్రేమ్‌నగర్, మార్తాండనగర్‌ల నుంచి వస్తున్న మురుగునీరు ఈ పార్కు పక్క నుంచి వెళ్తుంది. వరదకు తోడు మురుగు కూడా పార్కులో చేరింది. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవాలి

గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీలో లింక్ రోడ్డును ఆనుకొని ఉన్న పార్కును జీహెచ్ఎంసీ అధికారులు అభివృద్ధి చేయాలి. కాలనీవాసులకు పార్కులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలి. ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించాలి.

- శంకర్, కాలనీవాసి

పార్కు చిత్తడిగా మారుతోంది

చిన్నపాటి వర్షం పడితే చాలు పార్కు మొత్తం చిత్తడిగా మారుతోంది. ప్రహరీగోడ కూలిపోయింది.రానున్న వర్షాకాలంను దృష్టిలో ఉంచుకొని పార్కులో మొక్కలు నాటి మంచి వాతావరణం కల్పించాలి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

- మనోజ్, స్థానికుడు



పార్కులో తుప్పపట్టి విరిగిపోయిన ఆట వస్తువులు



ఎఫ్‌సీఐ కాలనీలోని పార్కులో చెత్తా చెదారం



గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ పార్కులో వరద, మురుగు నీరు

జేఎన్‌టీయూను సందర్శించిన నూతన ఇన్‌చార్జి వీసీ

బాలానగర్: జేఎన్‌టీయూ నూతన ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా నియమితులైన బుర్రా వెంకటేశం శనివారం వర్సిటీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను వైస్ చాన్సలర్ ఛాంబర్‌లో రెక్టర్ కె. విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ డా. కె. వెంకటేశ్వరరావుల సమక్షంలో యూనివర్సిటీలోని డైరెక్టర్‌లను, కళాశాల ప్రిన్సిపాల్, క్యాంపస్ కాలేజిలోని పలు డిపార్టుమెంట్‌లలో పనిచేస్తున్న, ఆచార్యులను, హెచ్‌ఓడీలను పరిచయం చేశారు. ఈ సందర్భంగా బుర్రా వెంకటేశం మాట్లాడుతూ విద్యార్థుల అవసరాన్ని గుర్తించి ఉత్తమ విద్యాబోధన చేయాలన్నారు. ఎటువంటి సమస్య ఉన్నా స్వయంగా నా దృష్టికి తీసుకువస్తే న్యాయం చేస్తానని తెలిపారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు..

కుత్బుల్లాపూర్: గాజులరామారంలోని హనుమాన్ ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ తనయుడు కూన కృష్ణాగౌడ్ హనుమాన్ మాలధారణ సందర్భంగా శ్రీశైలంగౌడ్, కేకేఎం ట్రస్ట్ ఛైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్, కూన జైకుమార్‌గౌడ్‌లు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హనుమాన్ మాలాధారులు పూజల్లో పాల్గొని భజనలు చేయడంతో స్థానికంగా ఆధ్యాత్మికత సంతరించుకుంది. అనంతరం హనుమాన్ మాల ధరించిన స్వాములకు, భక్తులకు అన్న ప్రసాదం అందించారు. అంజని పుత్రుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని శ్రీశైలంగౌడ్ అభిలాషించారు.